
# నీలాంజలి

-కంటపల్లి సన్యాసిరాజు



'అనకాపల్లి' ట్రాన్స్‌ఫర్ అయింది. అన్న విషయం తెలిసిన దగ్గర నుండి, శ్రీనివాస్ మనసులో ఏదో తెలియని అలజడి.

తను అనకాపల్లిలో డిగ్రీ చదువుకున్న రోజులు గుర్తుకు వచ్చాయి. ఆమె రూపం మదిలో మెదిలింది. మళ్ళీ ఇన్నాళ్ళ తరువాత ఆమెను చూడబోతున్నాన్నన్న ఆనందం శ్రీనివాస్‌ని నిలువనీయలేదు.

ఆమె స్ఫూర్తితోనే తనీనాడు ఒక గ్రూప్‌వన్ ఆఫీసర్ స్థానంలో ఉన్నాడు. ప్రతీ మగాడి విజయం వెనుక ఒక స్త్రీ ఉంటుందో లేదో కాని, తన విజయం వెనుక మాత్రం నిశ్చితంగా ఆమె ఉంది.

ఎక్కడో శ్రీకాకుళం జిల్లాలో మారుమూల గ్రామంలో పుట్టి, డిగ్రీ చదువుకై అనకాపల్లి వచ్చి, ఆకతాయిగా, జులాయిగా తిరిగే తనకు మార్గం చూపింది ఆమె!

శ్రీనివాస కళ్ళలో మేరీ ఆంటీ రూపం మెదిలింది!

ఎప్పుడూ తెల్లని డ్రెస్‌తో చెదరని చిరునవ్వుతో, మెడలో సిలువ బొమ్మతో....దేవతా మూర్తిలా ఉండేది. తన రూమ్ ప్రక్కనే ఆమె ఇల్లు. అయిన వాళ్ళంటూ ఎవరూలేరు! నా అన్న వాళ్ళందరూ అగ్ని ప్రమాదంలో ఆహుతి కాగా, చిన్నపాటి నుంచి, మిషనరీ, స్కూల్‌లో చదువుకుని, హాస్పటల్‌లో సిస్టర్‌గా పని చేసేది.

ఎవరితోడూ లేకుండా ఒంటరి స్త్రీ ఈ సమాజంలో జీవించడం సాధ్యమా?

'సాధ్యం' అని ఆమెను చూస్తే తెలుస్తుంది.

చిన్నప్పుడే తల్లిని పోగొట్టుకుని, మారుటతల్లి సత్కారాల మధ్య ప్రేమ రాహిత్యంతో పెరిగిన తను ఒకవిధంగా స్త్రీ అంటే ద్వేషం పెంచుకున్నాడు. ఎంతో నీచంగా చూసే సవతి తల్లితో ఆమెను పోల్చుకుని తేడాను గమనించేవాడు.

ఏ అనుబంధం లేకపోయినా, ఎంతో ఆత్మీయంగా పలకరించేది!

'మేరీ ఆంటీ', మేరీ తల్లి, నర్సమ్మా, నర్సాంటీ ఇలా ఆ కాలనీ వాళ్ళంతా ఆమెను పిలుస్తుండేవారు. ఆపదలో ఉన్న వాళ్ళనూ, అవసరంలో ఉన్న వాళ్ళనూ ఆదుకోవడమే ఆమె ధ్యేయం! పేదలకు ఉచితంగా, ఉన్నంతలో వైద్యంచేస్తూ, వాళ్ళ దృష్టిలో దేవతలా పిలువబడేది.

తమ మధ్య పరిచయం అనుబంధంగా మారిన రోజు తనకు బాగా గుర్తు!

దసరా మామూళ్ళు అడగడానికి తన దగ్గరికి ఎవరో రావడం, "పరీక్షలకు ఫీజు కట్టడానికి ఎమ్.ఓ. రాక నేనేడుస్తుంటే మధ్యలో ఫీ గోల ఒకటి" అని తను విసుక్కోవడం, ఆ మాట 'మేరీ ఆంటీ' వినడం, తనకు డబ్బులు ఇచ్చి ఫీజు కట్టమనడం జరిగింది.

ఆనాటి నుండి, ఏవిధమైన అవసరం వచ్చినా తనను అడగమని తనకి చెప్పింది.



ఇంకోసారి తనకు విపరీతమైన జ్వరం.

ఆంటీ ఆ రోజు హాస్పిటల్‌కు సెలవు పెట్టి, తనకు ఎన్నో సేవలు చేసింది. ఆ రోజు రాత్రి టెంపరేచర్ ఎక్కువగా ఉంటే, కన్నీళ్ళతో ప్రార్థన చేసింది.

భగవంతుడు ఎప్పుడు ఎందుకు ఎవరిని ఎలా కలుపుతాడో తనకి ఇప్పటికీ అర్థంకాదు.

'నీ ఋణం ఈ జన్మలో తీర్చుకోలేను ఆంటీ' అన్నాడు తను కన్నీళ్ళతో.

"మనిషికి మనిషి సహాయం చేయకపోతే ఎవరు చేస్తారు చెప్పు! ఆ పరమాత్ముడు ప్రతీ ఒక్కరి అవసరాలను స్వయంగా తీర్చలేక, సమస్తమానవాళి అవసరర్థమై 'స్త్రీ'ని సృష్టించాడు. అందుకే ఆమె తల్లిగా, చెల్లిగా, భార్యగా, స్నేహితురాలిగా ప్రియురాలుగా ఏదోరూపంలో ఆదుకుంటుంది. నేనుకూడా అంతే! కష్టంలో ఆదుకోవడమే మనిషిగా చేయదగ్గది"అనేది.

తనకి జ్వరం తగ్గాక అంది. 'ఇంటికి వెళ్ళి కొన్నాళ్ళు విశ్రాంతి తీసుకోకూడదు?'అని. ఆమెకేం తెలుసు? తను అక్కడకన్నా ఆంటీ సాన్నిధ్యంలోనే క్షేమంగా ఉంటానని, అక్కడకు వెళ్ళి సుఖం మాట ఎలా ఉన్నా మారుటతల్లి, తమ్ముళ్ళ మధ్య మరింత కృశించిపోవడం తప్పు! ఆ విషయమే ఆంటీకి చెప్పాడు తను.

ఓరోజు తను తన క్లాస్‌మెంట్ ప్రవంతితో క్లోజ్‌గా మూవ్ అవ్వడం ఆంటీ ఎలా చూసిందో, ఏమోగానీ తనకు పెద్దక్లాస్ తీసుకుంది.

"కాలేజీ అంటే కాలాన్ని లేజీగా గడపడం, ఎంజాయ్ చేయడం కొందరికే చెల్లుతుంది బాబూ. ఫస్టియర్ రెస్ట్ ఇయర్ అనుకోవడం, గర్ల్‌ఫ్రెండ్స్‌తో తిరగడం మనలాంటి వాళ్ళకు కాదు. అంతదూరం నుంచి ఎందుకు వచ్చావ్? చదువుకోవడానికి! మంచి ప్రయోజకుడివి కావాలి! నాలాంటి అనాథలకు నీవు చేయూతనివ్వాలి! కుటుంబానికి ఆదర్శప్రాయుడవు కావాలి. ముందు నీ పొట్ట నీవు నింపుకునే స్థోమత రావాలి. ఇంకొకరిపొట్ట నింపగల స్థితికి నీవు రావాలి".

కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి తనకు.

'ఒక కష్టం తరువాత వచ్చే సుఖమే నిజమైన సుఖం. కృత్రిమమైన సుఖాలు అనుభవిస్తే తరువాత నరకం అనుభవించక తప్పదు' అన్న నిజం అనుభవ పూర్వకంగా తెలుసుకున్నాడు.

శ్రీను - శ్రీనివాస్ - శ్రీనివాసరావు!

కాలం కళ్ళెంలేని గుర్రంలా పరిగెట్టింది.

లక్ష్య సాధనలో వీపుతడుతూ, కష్ట సమయంలో కన్నీళ్ళు తుడిచే ఆ అనురాగమయిని మళ్ళీ మళ్ళీ కలుసుకోవాలని ఎన్నిసార్లు అనుకున్నా ఎన్నో ఆటంకాలు పై చదువులు, ఉద్యోగంలో పోటీ, పెళ్ళి, పిల్లలు, వాళ్ళ చదువులు, నిరంతరం బిజీ...మళ్ళీ ఇన్నాళ్ళకు కలుసుకోబోతున్నాడు.

* * *

ఆకాశమంత ఆశతో మేరీ ఆంటీని చూడడానికి వచ్చిన శ్రీనివాస్....అక్కడ దృశ్యం చూసి స్టన్ అయ్యాడు. ముడతల చర్మంతో, లావుపాటి కళ్ళజోడుతో, వెండి తీగలాంటి జుట్టుతో.......ఆమేనా అని ఆశ్చర్యపోయాడు.

ఆ వయసులో కూడా ఆమె అభిమానంలో ఆదరణలో ఏ మార్పులేదు. ఆమె ఆదరణ ముందు అవని కూడా చిన్నదే! అనిపించింది శ్రీనివాస్‌కు.

కల్లాకపటం తెలియని ఆ ముఖంలో దైవకళ ఉట్టి పడుతోంది. వృద్ధాప్యంలో ఒంటరిగా ఎలా ఉంటుంది? ఆమెను ఏదో విధంగా ఆదుకోవాలనిపించింది. ఆమె అలసిన హృదయం సేద తీరేలా చేయాలి.

మెరుపులాంటి ఆలోచన వచ్చింది శ్రీనివాస్‌కు.

"ఆంటీ! మా ఇంటికి రండి ఈ వయసులో ఒంటరిగా ఉండడం ఏం బాగోలేదు. మాతో ఉండురుగాని, మీరు చూపించిన మార్గంలో నేను వెళ్ళి ప్రయోజకుడిని అయ్యాను. మీ ఋణం తీర్చుకునే అవకాశం కలిగించండి", అని ఆహ్వానించాలని అనుకున్నాడు. కాని...ఆ మాట గొంతులోనే ఉండిపోయింది.

కారణం......?

అతని భార్య రమ్యరూపం కళ్ళముందు కదిలింది!

ఆమె మనస్తత్వం కళ్ళముందు కదలాడింది!

అందుకే ఆమె అంగీకారం తీసుకున్న తర్వాతే మేరీ ఆంటీని తమతో తీసుకు వెళ్ళాలని నిర్ణయించుకున్నాడు.

రమ్య మనస్తత్వం కళ్ళముందు కనబడింది.

ఒకసారి ఏదో పని ఉండి ఆఫీసు నుంచి ఆలస్యంగా ఇంటికి వచ్చి, మీల్స్ చేస్తూంటే......

అలా తినేయడమే గాని, భార్యఉంది, అది తిందా లేదా అని అడగాలనిపించదా? అని కేకలేసింది.

ఇంకోసారి అలా అడిగితే.....

'అబ్బో...! ఇప్పటిదాకా షికార్లు కొట్టి వస్తే ఇక్కడ నేను మీ కోసం కడుపు మాడ్చుకు కూర్చుంటానా, చాలా ప్రేమకారి పోతుంది' అంటూ మూతి వంకర్లు తిప్పింది.

ఇంట్లో ఏదైనా వస్తువు కాలికి అడ్డంగా ఉంటే, దానిని దాటుకుంటూ వెళితే....... "అలా దాటుకుని పోయే బదులు,కాస్త తీసి పక్కన పెట్టొచ్చుకదా! కాస్త వంగినంత మాత్రాన కేలరీస్ ఏమీ నష్టపోరు. ఎంతయినా మగాడినన్న గర్వం అహంకారం"అనేది.

అలా అంది కదా అని ఎప్పుడయినా ఏదైనా వస్తువు పక్కకు పెడితే... "ఇప్పుడు మీకు అదేం అడ్డొచ్చిందట! భర్త చేత పని చేయిస్తున్నానని అందరూ నన్ను ఆడిపోసుకోవాలనా?" అని గయ్యుమంటుంది.

అంత భయంకరమైన మెంటాలిటీ గల రమ్య ఈ విషయంలో ఎలా రియాక్టవుతుందో ముందుగానే తెలిసినా ఏదో చిన్న ఆశ!

ఎలాగైనా ఆమెకు నచ్చచెప్పాలని నిర్ణయించుకున్నాడు శ్రీనివాస్.

* * *

"అయిన వాళ్ళకు ఆకుల్లో; కాని వాళ్ళకు కంచాల్లో" అంటే ఇదే మరి! అవ్వ!, కాటికి కాళ్ళు చాచిన ఆ ముసలిదాన్ని తీసుకువస్తారా? మీ మంద అందరికీ ఇప్పుడు చేస్తున్న చాకిరీ చాలదా? పేరి అబ్బుడు గాని చీర అబ్బుతుందని, దానికేదైనా 'రోగం - రొష్టం' ఉంటే అవి నాకు అంటుకుని చస్తే హాయిగా ఇంకో పెళ్ళి చేసుకోవచ్చు అన్న ఆశ! అయినా మీకు ఈ మధ్య మరీ చాదస్తం ఎక్కువ అవుతోంది. మీకు మరీ అంత ప్రేమకారిపోతే... ఏదో పదో పరకో ఇచ్చి ఋణం తీర్చుకోండి. అంతేకాని దానికి ఇంట్లో తెచ్చి పెట్టుకోవడానికి నేను ససేమిరా ఒప్పుకోను. అదేమైనా చుట్టమా, బంధువా..."

"మనకేమీ కాని వ్యక్తి కోసం ఆలోచించడమే మానవత్వం రమ్యా! కులం కన్నా గుణం ముఖ్యం. సంస్కృతి ఏదైనా సంస్కారం ముఖ్యం".

భార్య తట్టి లేపింది! "ఏమిటండీ నిద్రలో కలవరిస్తున్నారు" అంది.

అది కలయని తెలియడానికి ఒక్కక్షణం పట్టింది.

ఇద్దరూ లేచి కూర్చున్నారు!

రమ్య మూడ్ బాగున్నట్టుంది ఆటైంలో "ఏమిటండీ అనకాపల్లి వచ్చినప్పటి నుంచి ఏదోలా ఉంటున్నారు.



## చిరంజీవి పెళ్ళి!

మెగాస్టార్ చిరంజీవి పెళ్ళి 1980లో జరిగింది. అప్పటికి చిరంజీవి 11 చిత్రాలల్లో నటించాడు. వాటిలో అయిదు చిత్రాల్లో హీరోగా నటిస్తే, మూడు చిత్రాలలో విలన్‌గా నటించాడు. చిరంజీవి పెళ్ళికి ముందు 'కోతల రాయుడు', పెళ్ళి అయ్యాక 'కొత్తపేట రౌడీ!' అంటే అపార్థం చేసుకోవద్దు అవి రెండూ చిరంజీవి సినిమా పేర్లే!

\- రాజీ.

ఎనీ ప్రాబ్లమ్స్? ఆఫీసులోనా లేక ఏమయినా...... పర్సనల్..." భుజం మీద తల ఆనించి అడిగింది.

ఇదే సరి అయిన అవకాశం అనుకున్నాడు శ్రీనివాస్. రోజూ తనలో తను మధన పడడం కంటే... అటో ఇటో తేల్చేస్తే మంచిది. రమ్య అంగీకరిస్తే ఆమెను ఇంటికి తీసుకురావడం లేకుంటే హోమ్‌ఫర్ ఏజ్డ్‌లో చేర్పిద్దామని నిర్ణయించుకున్నాడు.

మేరీ అంటీ గురించి అంతా చెప్పాడు. తన నిర్ణయం కూడా చెప్పాడు. "జీవితాంతం తన సంపాదనను, శక్తిని ఇతరులకోసం ధారపోసిన వ్యక్తి ఆఖరి క్షణాల్లో దయనీయస్థితిలో ఉంటే.... ఆ మనిషిని చూసి మిగతా వాళ్ళు ఏమనుకుంటారు? సర్వం కోల్పోయిన ఆ మనిషి గురించి మిగతా తరం ఏమి నేర్చుకుంటారు? అంతా దాన ధర్మాలు చేస్తే ఆఖరికి అలానే అవుతారు, అని స్వార్థపరులుగా మారుతారు అలా కాకుండా ఆ వ్యక్తి నుంచి ప్రయోజనం పొందిన వ్యక్తి ఆ మనిషిని ఆదుకుంటే అప్పుడు లోకం 'అతని మంచితనమే అతన్ని కాపాడింది' అని అనుకుంటారు. 'ఉన్నప్పుడు ధర్మం చేస్తే లేనప్పుడు ఆ ధర్మమే మనల్ని కాపాడుతుంది' అని అంతా అనుకోవాలి. అందుకే రమ్యా మంచి తనాన్నీ, మానవత్వాన్నీ బ్రతికించాలని అనుకుంటున్నాను. నా నిర్ణయం తప్పా?" అని రమ్య వైపు చూశాడు.

రమ్య కళ్ళు వర్షిస్తున్నాయి!

ఆ మాతృమూర్తి దీనగాధ రమ్యను కదిలించి వేసిందో, లేక ఆ స్త్రీ మంచి మనసుతో తన మెంటాలిటీని కంపేర్ చేసుకుందో తెలియదు కాని ఆమె ముఖంలో మార్పు కొట్టొచ్చినట్టు కనిపించింది.

"మానవత్వం పరిమళించే ఆ మంచి మనిషి మనం తప్పక ఆదరిద్దామండి రేపే వెళ్ళి ఆమెను ఆహ్వానించండి! మానవత్వాన్ని బ్రతికించండి" అంది రమ్య.

నమ్మలేనట్టు చూశాడు శ్రీనివాస్.

ఆనందంతో ఆమెను వాటేసుకున్నాడు.

* * * * * *

మాతృమూర్తి సమానురాలయిన అంటీ పాద పద్మాలకు,

శరత్ చంద్ర నమస్కరించి వ్రాయునది. మీ ఆశీర్వాదం వలన నేను క్షేమము అంటీ! ఆ మధ్య ఇంటర్వ్యూలో నన్ను అత్యంత విలువైన రత్నాలలో ఒకదాని పేరు అడిగారు. నాకు గిన్నిస్ బుక్‌లోనే అత్యంత ప్రకాశ వంతమైన రత్నాలుగా పేరు పొందిన వాటిలో ఒకటయిన 'నీలాంజలి' పేరు కాకుండా మీ పేరు చెప్పాలనిపించింది.

అవునాంటీ, పరుల కోసం బ్రతికే మనిషనికన్నా, మంచితనం పంచే మనిషికన్నా విలువైన రత్నం ఇంకొకటి ఉంటుందా?

నేను ఈ నెల పదో తారీఖున ట్రయినింగ్ పూర్తి చేసుకుని వస్తున్నాను. అదే రోజు సాయంత్రం గోదావరి ఎక్స్‌ప్రెస్‌లో మళ్ళీ మనం హైదరాబాద్ చేరుకుంటు న్నాము. అవసరమైన అన్ని ఏర్పాట్లూ చేశాను. మీరు నా కోరిక కాదనరన్న గట్టి నమ్మకంతో! వృద్ధాప్యంలో ఒంటరిగా ఉండడం శ్రేయస్కారం కాదు. ఇక్కడ మంచి స్పెషలిస్టుతో మీ ఆరోగ్యానికి ఎటువంటి లోటు రాకుండా చూసే బాధ్యత నాది. మీ ఆరోగ్యం కాస్త కుదుటపడ్డాక, ఈ వాతావరణంలో నీవు ఇమడలేని పక్షంలో మళ్ళీ వెళ్ళిపోదురుగాని. నా అభ్యర్థనను తిరస్కరించవన్న నమ్మకంతో.........

మీ

శరత్ చంద్ర.

ఉత్తరం చదవడం పూర్తి చేసిన మరియమ్మ కళ్ళు సజలాలయ్యాయి.

వృత్తిరీత్యా కొందరికి, మానవతా దృష్టితో కొందరికి తనకు తోచిన సహాయం, సేవలు చేసింది. ఆ ప్రక్క రూమ్‌లోకి ఎందరో విద్యార్థులు వస్తూ పోతూ ఉంటారు. మూడేళ్ళ చదువు పూర్తయ్యాక కొన్నాళ్ళు ఉత్తరాలు వ్రాస్తూ ఉంటారు. కొన్నాళ్ళకు ఎవరి జీవన గమనంలో వాళ్ళు బిజీ అయి పాత పరిచయాలు జ్ఞాపకాలు కాల గర్భంలో కలిసిపోతాయి.

కాని...... శరత్ అలాకాదు!

కనీసం నెలకోసారయినా వచ్చి చూసి వెళతాడు!

అన్నీ ఉన్నా తల్లి ప్రేమ నోచుకోని దురదృష్టవంతుడు. కొన్ని రోజులలోనే తమది విడదీయరాని బంధంగా మారిపోయింది. తనలో అతను తల్లిని చూసుకున్నాడు. అమ్మా ఆంటీ అంటూ తనని పిలుస్తూ ఇంట్లో ఒకడిగా మారిపోయాడు.

తమది మృదు మధుర మమతాను బంధం.

సృష్టిలోనే పవిత్రమైన తల్లీకొడుకుల అనుబంధం!

శరత్ ఐ.ఎ.ఎస్ ఇంటర్వ్యూ రోజు యేసు ప్రభువు సన్నిధిలో ఉపవాస ప్రార్థన చేసింది. యేసు కరుణించాడు. శరత్ సెలెక్టయ్యాడు.

ఆమె కళ్ళు ఇంకా ధారాపాతంగా వర్షిస్తూనే ఉన్నాయి.

అవి ఆనంద బాష్పాలో లేక తను పెరిగిన పరిసరాలకు దూరంగా వెళ్ళిపోతున్నానన్న బాధో తెలీడం లేదు.

కన్న ప్రేమ కన్నా పెంచిన ప్రేమ గొప్పదా? సర్వం ధారపోసి, కనిపెంచిన తల్లిదండ్రులనే అవాధలను చేస్తూ... రెక్కలు రాగానే ఎగిరిపోయి, కన్న వారికి కన్నీళ్ళే మిగిలిస్తోన్న పిల్లలు ఉన్న ఈ రోజుల్లో....... ఈ తల్లి కాని తల్లి కోసం శరత్ పడే తాపత్రయం, చూపిస్తోన్న ఆరాటం నిజంగా ఆశ్చర్యం కలిగిస్తుంది మరియమ్మకు.

* * * * * *

శ్రీనివాస్ 'మేరీ అంటీ' ఇంటికి చేరుకున్నాడు.

పక్కింటిద్వారా ఆ వార్త విని, ఊహించని ఆ హఠాత్పరిణామాన్ని శ్రీనివాస్ నమ్మలేక పోయాడు.


అతని ముఖంలో విషాదం!

బలవంతంగా ఒక పూవును వికసింప చేయ వచ్చునేమో గాని, తన భార్య రమ్యను మార్చడం సాధ్యం కాదు అనుకుంటున్న తరుణంలో... పరోక్షంగా తన భార్యను మార్చిన దేవత మేరీ అంటీ!

తన కథతో ఆమెలో ఉన్న మూర్ఖత్వాన్ని పారద్రోలింది. అటాంటి దేవత ఋణం తీర్చుకునే అవకాశం లేకుండా పోయింది అతనికి

'మరుజన్మలోనయినా మీ ఋణం తీర్చుకునే భాగ్యం ప్రసాదించండి అంటీ' అని మనస్సులో అనుకున్నాడు శ్రీనివాస్.

-కె.యస్. రాజు,
స్టేట్ బ్యాంక్ అఫ్ హైదరాబాద్,
అర్మూర్ బ్రాంచ్.




కె. శ్రీనివాస్ (కార్టూనిస్ట్), పోస్ట్: మల్లారం, మండలం: మలహాం- 505 184 జిల్లా: కరీంనగర్.